క్లుప్తంగా

దశభుజ గణపతికి పూజలు



అలంకరణలో దశభుజ గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఉరవకొండ: చలి తీవ్రత ఎక్కువవుతున్న తరుణంలో రోడ్డు పక్కన ఉండే అనాథలతో పాటు ఉరవకొండలోని విఠల్, రుక్మిణి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం సవాబ్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేపట్టారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వన్నూర్‌సాబ్, సభ్యులు కొత్తరవి, తలారిమల్లి, నబి రసూల్, నూర్జహాన్, వన్నూరమ్మ, కోమల, సల్మా, భాను పాల్గొన్నారు.

సహకార సంఘం బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు గంగాధర్

కూడేరు: అందరూ సమష్టిగా పనిచేసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బలోపేతానికి కృషి చేద్దామని ఆ సంఘం అధ్యక్షుడు వడ్డే గంగాధర్ సూచించారు. ఆదివారం కూడేరులోని సహకార సంఘం కార్యాలయంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు సహకార పతకాన్ని ఎగర వేశారు. ఆయన మాట్లాడుతూ ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి చొరవతో సంఘం తరఫున పెట్రోల్ బంక్ మంజూరైందన్నారు. రెండు గోదాములు నిర్మాణానికి రూ.1.22 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. రైతులకు విరివిగా రుణ సదుపాయం కల్పించి సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సబ్ డివిజనల్ ఆఫీసర్ బాలగంగాధర్, కో–ఆపరేటివ్ ట్రెనింగ్ సెంటర్ లెక్చరర్ శ్రీనివాసులు, ఏడీసీసీ బ్యాంక్ అధికారి ముకుంద, సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీసీసీ సహాయ కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, ఎ బ్లాక్ అధ్యక్షుడు బియాఉద్దీన్, నాయకులు మాల ఎర్రిస్వామి, దాదాపీర్, వడ్డే గోవిందప్ప, గఫూర్, బాషా, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల గ్రంథాలయ అధికారి కుళ్లాయమ్మ, ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శివపార్వతులకు అన్నాభిషేకం



అన్నాభిషేకం చేసిన దృశ్యం

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం జోడు లింగాలకు పురోహితులు శివ శంకర్ శాస్త్రి , మహేష్, ప్రవీణ్ స్వాములు అన్నాభిషేకం చేశారు. తర్వాత క్షీరాభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు శివపార్వతులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పీహెచ్‌సీకి విషపురుగుల బెడద



పీహెచ్‌సీ ముందు పిచ్చిమొక్కలు, గడ్డి ఉన్న దృశ్యం

కూడేరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలోకి విషపురుగులు వస్తున్నాయి. గత నెలలో మూడు పాములు పీహెచ్‌సీలోకి రాగా అప్రమత్తమైన సిబ్బంది వాటిని చంపేశారు. పాముల సంచారంతో సిబ్బంది, వైద్యం కోసం వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పీహెచ్‌సీ ముందు భాగాన, పక్కన పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగింది. అందులో నుంచి విషపురుగులు బయటకు వచ్చి పీహెచ్‌సీలోకి వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించాలని మండలవాసులు కోరుతున్నారు.

శరవేగంగా బీటీపీ కాలువ పనులు

- నెరవేరనున్న 'దుర్గం' రైతుల ఆకాంక్ష
- తీరనున్న తాగు, సాగునీటి కష్టాలు



ముదిగల్లు వద్ద ముమ్మరంగా సాగుతున్న బీటీపీ కాలువ పనులు

కళ్యాణదుర్గం: భైరవానితిప్ప ప్రాజెక్టు(బీటీపీ) పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది జూలై 8న రైతు దినోత్సవం కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరాల జల్లుతో బీటీపీ పనులు ముందుకు కదిలాయి. ప్రాజెక్టు పనులతో దుర్గం రైతుల ఆకాంక్ష నెరవేరనుంది. దీంతో కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తితో పాటు రైతుల సాగు కష్టాలు తీరనున్నాయి. గతంలో టీడీపీ ఎన్నికల ముందు ఆర్భాట పనులు చేసి హంగామా చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులపై ఉన్న చిత్తశుద్ధితో బీటీపీని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన రూ.80 కోట్ల నిధులతో పనులను ముమ్మరంగా జరుగుతున్నాయి. బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి రాయదుర్గం నియోజకవర్గంలోని భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తరలించేందుకు ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 93 కిలోమీటర్ల కాలువ నిర్మాణం, 8 లిఫ్టులు, 8 సబ్ స్టేషన్ల నిర్మాణం జరగాల్సివుంది. ఇందుకోసం రూ.542 కోట్లు (భూసేకరణ కాకుండా) అవసరం కానుంది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి 3.7 టీఎంసీలను తరలించేందుకు వీలుగా కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులు నింపడానికి 1.7 టీఎంసీలు, బీటీపీ ప్రాజెక్టుకు 2 టీఎంసీలు తరలించి ఆ ప్రాంత రైతులకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చడమే ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.

బాబు హయాంలో ఆర్భాటంగా పనులు

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం బీటీపీని తమ్ముళ్లకు ఆదాయ వనరుగా మార్చింది. 2019 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజా వ్యతిరేకత నుంచి కాపాడుకునేందుకు ఆర్భాటంగా కొన్ని కార్యక్రమాలు చేసింది. 2018లో భూ సేకరణ చేయకుండానే ఆదరాబాదరాగా ప్రాజెక్టు పనులను చంద్రబాబు ప్రారంభించారు. సుమారు రూ.30 కోట్ల వరకూ ఖర్చు చేశారు. కొందరు టీడీపీ నాయకులు మట్టి పనులు మాత్రమే చేసి నిధులు దండుకున్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పనులు ప్రారంభం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో రాయదుర్గం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ సేకరణ కార్యక్రమాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం పూర్తి చేశారు. సుమారు 1,406 ఎకరాలకు రూ.208.85 కోట్లు అవసరం అవుతుందని గుర్తించారు. గత ప్రభుత్వంలో చేసిన పలు పనులకూ బిల్లులు మంజూరు చేశారు. అలాగే ఇచ్చిన మాట మేరకు సభా ప్రాంగణం నుంచే నిధుల విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రాజెక్టుకు సంబంధించి రూ.208.85 కోట్ల నిధులను విడుదల చేస్తున్నట్లు సీఎం రైతులకు తీపి కబురు అందించారు. హామీ మేరకు రైతుల ఖాతాలకు జమ చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఇటీవల రూ.80 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

బీటీపీపై సీఎం చిత్తశుద్ధితో ఉన్నారు



బీటీపీపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారు. రైతుల పక్షపాతి సీఎంగా అన్నదాతల గుండెల్లో జగన్ నిలిచిపోతారు. కళ్యాణదుర్గం రైతుల కల సాకారమయ్యే రోజులు దగ్గర పడ్డాయి. బీటీపీపై టీడీపీ మాయమాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టింది. బీటీపీని పూర్తి చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తాం.

– కేవీ ఉషశ్రీచరణ్, రాష్ట్ర మంత్రి

బీటీపీని త్వరలో పూర్తి చేస్తాం



బీటీపీ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.80 కోట్ల నిధులతో పనులను ప్రారంభించాం. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన రూ.128.85 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే మిగిలిన పనులను ప్రారంభిస్తాం.

– దేశే నాయక్, ఎస్ఈ, హెచ్ఎన్ఎస్ఎస్

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఉరవకొండ: పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

బెళుగుప్ప: మండలంలోని శీర్పి గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సచివాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

కూడేరు: 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం ఇప్పేరులో నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ ,ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అశ్వని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ నేతలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

కణేకల్లు: మండలంలోని పులచెర్ల గ్రామంలో సోమవారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి ఆదివారం తెలిపారు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



బొమ్మనహాళ్: మాట్లాడుతున్న ఎస్ఐ శివ



కంబదూరు: పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎస్ఐ శివ సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం దిశ యాప్, సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ప్రసాద్, ఆర్డీటీ సీఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారి సత్యంబాబు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో శారద కాన్వెంట్ కరస్పాండెంట్ రవికుమార్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభం



లక్ష్మీ నృసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు, ఈఓ



ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ప్రసంగిస్తున్న ఆధ్యాత్మిక వేత్త

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం పుణ్యక్షేత్రంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార వారోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ఉత్సవాలకు జ్యోతి ప్రజ్వలన చేశారు. భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహునికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మొదటి రోజు లక్ష్మీనృసింహుని అవతారం, ఆవిర్భావం తదితర అంశాలపై ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బలరాం వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మికత, భక్తి భావం పెంపొందించాలన్న లక్ష్యంతో దేవదాయశాఖ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని అనుసరించాలని సూచించారు.

కార్యక్రమంలో ఆలయ అర్చకులు ద్వారాకనాథ్ చార్యులు, బాలాజీ స్వామి, సిబ్బంది మారుతీ ప్రసాద్, దీపక్, భక్తులు పాల్గొన్నారు.

అక్కమాంబ కొండ ఆక్రమణ



అక్కమాంబ కొండ సమీపంలో చదును చేసిన రియల్టర్లు

- రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కొండకు ముప్పు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

కళ్యాణదుర్గం: రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్కమాంబ కొండను సైతం వదల్లేదు. కొండ పొరంబోకు స్థలాన్ని కబ్జా చేసేశారు. ఇదంతా అనంతపురం ప్రధాన రహదారిలో జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణానికి తలమానికంగా ఉన్న అక్కమాంబ కొండకు ఆనుకుని సర్వే నం.470 లో సుమారు 98 ఎకరాలకు పైగా కొండ పొరంబోకు ఉంది. కొండ పొరంబోకుకు ఆనుకుని ఉన్న సర్వే నం.301–3 రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. కొండకు ఆనుకుని సదరు సర్వే నంబర్లో సుమారు 2 ఎకరాలు ఉన్నట్లు రియల్టర్లు చెబుతున్నారు. అయితే అదనంగా కొండ పొరంబోకు స్థలం కూడా కలసి వస్తుందనే ఆశతో రియల్టర్లు తమకు పూర్వం పట్టా ఉందంటూ చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. గత మూడు రోజులుగా కొండ ప్రాంతంలో భారీ యంత్రాలతో చదును చేసే పనులు చేపట్టారు.

పట్టపగలే బ్లాస్టింగ్

కొండకు సమీపంలోనే అనంతపురం ప్రధాన రహదారి ఉంది. నిత్యం రద్దీగా ఉంటూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ద్విచక్ర వాహన దారులు, పాదచారులు సైతం ఇదే దారిపై వెళ్తుంటారు. ఇవేవీ రియల్టర్లకు పట్టలేదు. పట్టపగలే పెద్ద పెద్ద రాతి బండలను బ్లాస్టింగ్ వేసి పగులగొడుతున్నారు. రియల్టర్ల వ్యవహారంపై ఆలయ కమిటీ సభ్యులు మండిపడుతున్నారు. హద్దులు చూపకుండా ఎలా చదును చేస్తారంటూ ఆలయ కమిటీ సభ్యులు నిలదీసినా రియల్టర్లు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. భవిష్యత్తులో అక్కమాంబ కొండకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి అక్కమాంబ కొండను కాపాడాలని ఆలయ కమిటీ చైర్మన్ బత్తిని రాము కోరారు. ఇదే విషయమై తహసీల్దార్ ఫణికుమార్ మాట్లాడుతూ 301–3 సర్వే నంబర్ అక్కమాంబ కొండకు ఆనుకుని ఉంది. 1985లోనే ఏలూరి రామకృష్ణ అనే వ్యక్తి పేరున రెండు ఎకరాలు ఉన్నట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇచ్చారు. కొండ పొరంబోకులోకి వెళ్లకుండా హద్దులు ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. ఆక్రమించినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామన్నారు.

ఉజ్వల పథకానికి డిమాండ్



గ్యాస్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన లబ్ధిదారులు

రాయదుర్గంటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ కనెక్షన్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఇప్పటి దాకా గ్యాస్ కనెక్షన్లు లేని మహిళలకు ఉజ్వల్ స్కీమ్ వర్తిస్తుంది. ఉచిత కనెక్షన్‌తోపాటు గ్యాస్ సిలిండర్, స్టౌ పొందవచ్చు. ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం పట్టణంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దరఖాస్తులు సమర్పిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి వంట గ్యాస్ అందించే ఉద్దేశ్యంతో ఉచిత కనెక్షన్లను మోదీ సర్కారు చేపట్టిన విషయం తెలిసిందే. రాయదుర్గం పట్టణంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉచిత కనెక్షన్ల కోసం మహిళలు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. కాగా ఆధార్ కార్డు, కొత్త రేషన్ కార్డు కలిగి ఉండి ఇప్పటి దాకా గ్యాస్ కనెక్షన్ లేని వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఇప్పటి దాకా దాదాపు 500కు పైగా దరఖాస్తులు స్వీకరించగా వంద మంది లబ్ధిదారులకు ఉచిత కనెక్షన్లు మంజూరు చేశామని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి గ్రామానికి చెందిన పెద్దిరాజు పనిపై బైక్‌లో గుత్తికి వచ్చాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో గొర్రెలను తప్పించబోయి పెద్దిరాజు బైక్‌పై నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన పెద్దిరాజును స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరికి తెగులు.. రైతుకు దిగులు



తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

బొమ్మనహాళ్: రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల్లో తుంగభద్ర జలాశయం, బోర్లు కింద సాగు చేసిన వరి పంటకు పలు తెగుళ్ల సోకడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తుంగభద్ర ఎగువ కాలువ, బోర్ల కింద 1.5 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు అధికారులు అంచనా. ప్రస్తుతం వరి పంటకు ఎర్ర తెగులు, కంకి తెగులు, అగ్గి తెగులు, సుడిదోమ తదితర తెగుళ్ల ఎక్కువ కావడంతో ఎక్కువగా పంటలు దెబ్బతింటున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలోని లింగదహాళ్, కృష్ణాపురం, రంగాపురం క్యాంపు, తిమ్మలాపురం, గోనేహాళ్, కణేకల్లు, నాగలాపురం, ఉద్దేహాళ్, బండూరు, మారెంపల్లి, ఉడేగోళం, తుంబిగనూరు తదితర గ్రామాల్లో సాగైన పంటకు తెగుళ్ల ఎక్కువ కావడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. తెగుళ్లతో పాటు కాండం తొలుచు పురుగు వరి పంటను దెబ్బతీస్తోందన్నారు. అధికారులు స్పందించి తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మందులు పిచికారీ చేయాలి



ప్రస్తుతం వరి పంటకు అగ్గి తెగులు, దోమ పోటు కనిపిస్తోంది. దోమపోటు నివారణకు తగిన మోతాదులో అస్లాడ్, అసిపేట్ మందును పిచికారీ చేయాలి. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మందు పిచికారీ చేయాలి. రైతులు నత్రజని ఎరువులు వాడకం తగ్గించాలలి. వరి పొలంలో నీటిని ఎక్కువ మోతాదులో నిల్వ ఉంచకుండా అరబెట్టాలి. రైతులు తగిన మోతాదులోనే రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులను పిచికారీ చేయాలి. ఇష్టారాజ్యంగా ఎరువులు, క్రిమి సంహారక మందులను వాడొద్దు.

– సాయికుమార్, వ్యవసాయాధికారి, బొమ్మనహాళ్

థ్యాంక్యూ.. సీఎం



సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

కంబదూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎస్సీ కాలనీవాసులు థ్యాంక్యూ సీఎం సర్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అండేపల్లి ఎస్సీ కాలనీలో వీరబ్రహ్మేంద్రస్వామి నూతన ఆలయం నిర్మాణానికి టీడీపీ దేవస్థానం నుంచి రూ.10 లక్షల నిధులను కేటాయించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణానికి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ చిత్రపటాలకు ఆదివారం కాలనీవాసులు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి



మాజీ ఎమ్మెల్యే విశ్వను సత్కరిస్తున్న ఎంపీపీ నరసింహులు

ఉరవకొండ: మండలంలో పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని నూతన ఎంపీపీ నరసింహులుకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఇన్‌చార్జ్ విశ్వేశ్వరరెడ్డిని ఎంపీపీ మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ఈసందర్భంగా నరసింహులు మాట్లాడుతూ తనకు ఎంపీపీగా అవకాశం కల్పించిందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులందరినీ కలుపుకుని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో వాచ్‌మెన్ మృతి



నరసింహులు (ఫైల్)

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో వాచ్‌మెన్ దాసరి నరసింహులు (33) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు ఆస్పత్రి ఆవరణలో ఉన్న చెత్తను శుభ్రం చేస్తుండగా అతడికి ఛాతిలో నొప్పి రావడంతో వైద్య సిబ్బంది వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ పెరగడంతో 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య శోభ, ఇద్దరు కుమారులున్నారు.

నేడు 'స్పందన'

వజ్రకరూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

ఆశాజనకంగా ఆముదం



కమ్మూరు వద్ద సాగైన ఆముదం పంట

కూడేరు: ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగైన ఆముదం ఆశాజనకంగా ఉంది. వేరుశనగ పంట సాగుకు పెట్టుబడి అధికమవడంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడినందించే ఆముదం పంట సాగు వైపు రైతన్నలు మొగ్గు చూపుతున్నారు. 2021–22లో 1792 ఎకరాల్లో, 2022–23లో 7972, 2023–24లో 10,214 ఎకరాల్లో పంట సాగు చేశారు. ముఖ్యంగా పి.నారాయణపురం, జల్లిపల్లి, కరుట్లపల్లి, బోళసముద్రం, జయపురం, కూడేరు, అంతరగంగ, మరుట్ల, బ్రాహ్మణపల్లి, గొటుకూరు తదితర గ్రామాల్లో ఆముదం ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి ఆముదం పంట ఆశాజనకంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.